క్లుప్తంగా

వలంటీర్లకు అవార్డులు



కర్లపాలెం: కర్లపాలెం మండల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు ప్రదానం చేసిన సేవా వజ్ర అవార్డు ఇరువురికి, సేవా రత్న అవార్డు ఐదుగురికి వచ్చాయి. బాపట్ల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వారు అవార్డులు అందుకున్నారు. వలంటీర్లు దొంతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి(దుండి వారిపాలెం), మేకల సుందర్‌రావు(పేరలి) సేవా వజ్ర అవార్డును కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే పిట్టు కల్యాణ్, అబ్దుల్ రహీం(కర్లపాలెం), మైలా అశ్వినీ(దమ్మన వారిపాలెం), శావలి కేజియా(గణపవరం), బోనాసి పావని(చింతాయపాలెం) సేవా రత్న అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.రాంబాబు, ఈఓపీఆర్డీ ఎలీషా బాబు, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

రేపల్లె: మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదని ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ అన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించి, డ్రైవింగ్ చేస్తున్న పలువురు మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పట్టణంలో మైనర్లు అతివేగంతో ప్రధాన రహదారులపై వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎస్‌ఐ తెలిపారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు వాహనాలు సీజ్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు.

పోస్ట్‌మాస్టర్ మృతి



పిట్టలవానిపాలెం: భవనంవారి పాలెంలోని పోస్టు మాస్టర్ కొల్లి రామ్మోహన్‌రెడ్డి(50) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన 20 ఏళ్లుగా గ్రామంలో పోస్టు మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోస్ట్‌మాస్టర్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

వంతెన.. ఇక అంతేనా..!



పిట్టలవానిపాలెం: భవనంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చోడిపాలెం శివారులో గల ఆరెమండ్ల పంట కాలువపై నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరింది. నిత్యం దీనిపై వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఈ వంతెనపై నుంచే తరలిస్తుంటారు. దశాబ్దాలు పూర్తి చేసుకున్న వంతెన నిర్మాణం.. ప్రస్తుతం ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ఉందని స్థానికులు చెబుతున్నారు. చువ్వలు తేలి, కాంక్రీట్ దెబ్బతిన్న ఈ వంతెన స్థానం నూతనం నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

మట్టి ఖర్చులు అందజేత

భట్టిప్రోలు: పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేడికొండ మరియదాసు గుండెపోటుతో ఈ నెల 15న మృతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద శుక్రవారం మట్టి ఖర్చుల నిమిత్తం మండల సమాఖ్య తరపున రూ.10వేలు నగదును ఆ పార్టీ నాయకుడు నీలా నాగరాజు అందజేశారు. 14వ వార్డు సభ్యురాలు గాడెళ్ల మార్తమ్మ, సచివాలయ సిబ్బంది శివరామకృష్ణ, పూర్ణ, వలంటీర్ బుస్సా స్వప్న పాల్గొన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



రేపల్లె రూరల్: పేదలను అగౌరవపరిచేలా వారికి ఇచ్చిన నివేసన స్థలాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో దహనం చేశారు. డౌన్ డౌన్ చంద్రబాబు, పేదల ద్రోహి చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయం నుంచి సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. సెంటు భూమి సమాధికి కూడా చాలదంటూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ పథకాల జల్లు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- తాడిగిరిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



తాడిగిరిపాడులో కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఆనందంగా గడుపుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం చిన పులివర్రు సచివాలయం పరిధిలోని తాడిగిరిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించి చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. అమలు చేస్తున్న పథకాల కారణంగా వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా మెరుగుపడటాన్ని ప్రతిపక్ష టీడీపీ ఓర్వలేకపోతోందన్నారు. దుష్ప్రచారాలు చేస్తూ అడ్డుకోవడానికి ప్రయత్నించడం పేద వర్గాలపై ఆ పార్టీకి ఉన్న కపట ప్రేమకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగంతో పాటు, విద్య, వైద్య రంగాల అభివద్ధికి నిరంతరం కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. తాడిగిరిపాడుకు చెందిన బెల్లంకొండ పున్నమ్మ తన కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రూ.8.41 లక్షల లబ్ధి సంక్షేమ పథకాల రూపంలో చేకూరడంతో..ఆర్థిక సమస్యలు తీరాయని మంత్రి మేరుగ వద్ద సంతోషం వ్యక్తం చేసింది. మరో లబ్ధిదారులు శొంఠి రాజేశ్వరి తన కుటుంబానికి రూ. 2.41 లక్షల లబ్ధి చేకూరడంతో పాటు, తన బిడ్డల చదువుకు విద్యాదీవెన అందుతోందని ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపర్తి మాణిక్యం, మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు ఇంటూరి ప్రవీణ్, అమిరిశెట్టి శ్రీధర్, వేమూరు ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, మాజీ సర్పంచ్ పిల్లి ప్రేమ్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలకా ప్రకాశం, కనపర్తి మోహన్ రావు, నాదెండ్ల నరేంద్ర, మాతంగి రత్నకుమార్, మేకతోటి ఏలియ్య, మద్దాల యాకోబు, గద్దే యోహాను, అద్దంకి క్రాంతి, విక్కుర్తి ప్రసాద్, బిట్ర గుంట శ్రీను, మద్దాల దావీదు, కొల్లూరు పాండు రంగారావు పంచాయతీ కార్యదర్శి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు అజరామరం



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: స్వాతంత్ర్య సమర యోధుడిగా, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, ఆంధ్రరాష్ట్ర శాసన సభ, పార్లమెంట్ సభ్యునిగా పుచ్చలపల్లి సుందరయ్య సేవలు అజరామరమని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పుచ్చలపల్లి నిరాడంబర జీవితం సాగిస్తూ, నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని ఆయన అన్నారు. కార్మికులు, రైతుల కోసం అనేక ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. ఆయన బాటలో సీపీఎం శ్రేణులు నిరంతరం పయనిస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రమేష్, జె.ధర్మరాజు, వై.కిషోర్, బి.నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రామేడ్ సుందరయ్యకు ఘన నివాళి

అమృతలూరు(భట్టిప్రోలు): క్రామేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. అమృతలూరు మండలం యలవర్రులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం వేమూరు మండల కార్యదర్శి బొనిగల అగస్టీన్ మాట్లాడారు. నిస్వార్థ ప్రజా సేవకుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన ధన్యజీవి అని కొనియాడారు. నాయకులు కొత్తపల్లి మ్యాథ్యూస్, మల్లంపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో భట్టిప్రోలులోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్, నాయకులు ఆకురాతి శ్రీనివాసరావు, మురుగుడు సత్యరారాయణ, జి.నాగరాజు, బి.నాగమల్లేశ్వరరావు, ఎం.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



భట్టిప్రోలులో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకుల నివాళి

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్
- ఆకస్మికంగా వేసవి శిక్షణ శిబిరాల తనిఖీ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న చైర్మన్ దేవానంద్

పెదనందిపాడు/ప్రత్తిపాడు/గుంటూరు రూరల్/కాకుమాను: విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా ఉపయోగపడుతున్నాయని, వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ ఏటుకూరు శాఖ గ్రంథాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 8 నుంచి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను దేవానంద్ పరిశీలించారు. శిబిరంలోని అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 98 శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు పి.సుభాషిణి, బి.అరుణ, వి.పరమేశ్వరి, జోగి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

21న అన్నమయ్య గ్రంథాలయం సందర్శన యాత్ర

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలోని అన్నమయ్య గ్రంథాలయాన్ని ఈనెల 21న సందర్శించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి ఎస్.ఎం.సుభాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల ప్రకాశం జిల్లా వేటపాలెంలో 'సరస్వతి నికేతనమ్' గ్రంథాలయ సందర్శన యాత్రతో ఈ యాత్రను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. ఏపీ ఘనకీర్తిని మరింత చాటేలా 77 మంది కవులతో తీర్చిదిద్దిన 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారని తెలిపారు.

సీనియార్టీ జాబితాను రూపొందించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను మెరిట్ కం రోస్టర్ విధానంలో రూపొందించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో పి.శైలజను కలిసిన ఎస్టీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేరా మోహనరావు, చందా నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగోన్నతులను ఎటువంటి ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు డి. పెదబాబు, డీఏ జోసఫ్, షేక్ బాజీ, సీహెచ్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పేరలి(కర్లపాలెం): పేరలి పంచాయతీ మేకల వారిపాలేనికి చెందిన మేకల రాముడు (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. రాముడు అంత్యక్రియలకు పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పేరలి బాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య రూ.5వేల నగదు అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి మద్దిబోయిన శివరావు, గేరా ఏసుబాబు, షేక్ సుభాని, మల్లెల పౌలు, నాదెండ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేమూరు: విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సబ్ ఇంజినీరు బి.రాఘవేంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెనుమర్ర, కోడివర్రు, చావలి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.

రేపు క్రికెట్ సెలక్షన్స్

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ ట్వంటీ-ట్వంటీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ట్వంటీ ట్వంటీ రాష్ట్ర జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి నాజరుపేటలోని లూథరన్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఎంపికైన జట్టు జూన్ 5వ తేదీ నుండి కేరళలో జరుగనున్న నేషనల్ క్యాష్‌ప్రైజ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని చెప్పారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధిస్తున్న భర్తపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చుట్టుగుంటకు చెందిన అమర్తలూరి వెంకటేశ్వరరావు, గీతికలకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. వెంకటేశ్వరరావు తరచూ వేధిస్తున్నాడని గీతిక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిబ్రవరి కూలి వెంటనే చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న అప్పారావు

రేటూరు(కాకుమాను): ఉపాధి హామీ కూలీలకు ఫిబ్రవరి నెల నగదును వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేటూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన సందర్శించారు. రోజు రోజుకు మండుతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా కూలీలు పనులకు వస్తున్నారని అన్నారు. అయినా.. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెల కూలి నగదు నేటికీ విడుదల చేయకపోవడం కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. పని ప్రదేశాల్లో కనీసం తాగునీటిని కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం నగదును కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం నాయకుడు జగన్ తదితరులు ఉన్నారు.

మద్దతు ధరపై మొక్కజొన్న కొనుగోలు ప్రారంభం



మున్నంగి ఆర్బీకేలో రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు

మున్నంగి (కొల్లిపర): మండలంలోని రైతుభరోసా కేంద్రంలో రైతుల వద్ద నుంచి ప్రభుత్వం మొక్కజొన్న క్వింటా మద్దతు ధర రూ.1962 పై కొనుగోలు చేస్తుందని ఏవో కె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలోని ఆర్బీకే 2 కేంద్రంలో రైతుల వద్ద నుంచి మొక్క జొన్న కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మధ్యవర్తులు మొక్కజొన్న క్వింటాకు రూ.1750 కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కావున రైతులు ఎవ్వరూ మధ్యవర్తులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా మధ్యవర్తులు మాటలు నమ్మ కుండా ఎటువంటి అపోహలు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకే కేంద్రంలో ప్రభుత్వం మద్దతు ధరకు మాత్రమే అమ్ముకోవాలని, అధిక లాభాలు పొందాలని కోరారు. గ్రామానికి చెందిన వంగా జయరామిరెడ్డి వద్ద నుంచి 173 క్వింటాలు మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న కొల్లిపర 3 ఆర్బీకే కేంద్రంలో గుదిబండ సుధాకర్‌రెడ్డి , గుదిబండి శ్రీనివాసరెడ్డి కలసి 200 క్వింటాలు మొక్కజొన్నలు వేయగా 18న వారి ఖాతాలో రూ.3 లక్షల 92 వేల 400 జమ అయినట్లు తెలిపారు. వీరు కొనుగోలు కేంద్రాలకు మొక్కజొన్న వేసిన ఆరు రోజులల్లో మొత్తం జమ కావటంతో రైతులు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

టీడీపీ సర్పంచ్‌పై వైసీపీ సర్పంచ్, నాయకుల ఫైర్



టీడీపీ సర్పంచ్ మాటలను ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ సర్పంచ్ లక్ష్మారెడ్డి

ప్రత్తిపాడు: ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లను నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని టీడీపీ సర్పంచ్‌పై, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌తో పాటు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిక్కిరెడ్డిపాలెం తెలుగుదేశం సర్పంచ్ మాకినేని జగన్ వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి తప్ప ఎందుకూ పనికిరారని, వాళ్ల వల్ల ఉపయోగం ఉండటం లేదంటూ.. కించపరిచేలా మాట్లాడారు. దీంతో ఆగ్రహానికి గురైన కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి.. టీడీపీ సర్పంచ్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వలంటీర్లు గ్రామాల్లో నిస్వార్థంగా పనిచేస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉన్న వారిని అవమానించేలా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. పనిచేయని ఒకరిద్దరుంటే.. వారు ఎవరో చెప్పాలి గానీ, అందరినీ దూషించడం సరికాదన్నారు. జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓంప్రకాష్ రెడ్డిలు టీడీపీ సర్పంచ్ జగన్‌మోహన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామాల్లో జరుగుతున్నా కనీసం ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఎందుకు సమాచారం ఇవ్వరని జెడ్పీటీసీ.. వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్‌ను ప్రశ్నించారు. నకిలీ పురుగు మందులు రాకుండా చూడాలని సర్పంచ్ లక్ష్మారెడ్డి ఏవోను కోరారు. విద్యుత్‌శాఖ అధికారులపై కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు మండిపడ్డారు. అర్ధరాత్రి వేళ ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, ఫోన్లు చేస్తే తియ్యరని, ప్రజలు తనను నిద్ర పోనివ్వడం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నమ్మ, ఎంపీడీవో శ్రీరమ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

28 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

తెనాలిరూరల్: స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య తెనాలి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీ మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ విద్య పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని అన్నారు. పాఠ్య పుస్తకాలు అమ్ముతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ బోర్డు రూల్స్ పాటించకుండా, అనుమతులు లేని భవనాలలో కళాశాలలను, పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు, వేసవి సెలవులలో కూడా కళాశాల నిర్వహిస్తు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో యాజమాన్యం ఒత్తిడికి గురై విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కాబట్టి తక్షణమే అధికారులు విద్యా సంస్థలను తనిఖీ చేసి అనుమతులు లేని భవనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేసారు. ఈ నెల 28 నుండి 30 వరకు భీమవరంలో ఏఐఎస్ఎఫ్ కోస్తాంధ్ర రాజకీయ శిక్షణ తరగతులు జరగనున్నాయని ఈ శిక్షణ తరగతులకు తెనాలి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనీ జయప్రదం చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు అన్నం అరవింద్, నీరజ్ సాయి, శ్రీను, కోలా శేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కరిముల్లా బాబా ఉరుసు మహోత్సవం



శోభాయమానంగా కరిముల్లా షా ఖాదరి నిషాని

పెదకాకాని: కరిముల్లా షా ఖాదరి నిషాని ఉరుసు గంధ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 14వ ఉరుసు గంధ మహోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడు రోజుల ఉరుసు మహోత్సవంలో బాగంగా రెండవ రోజు శుక్రవారం రాత్రి 10 గంటలకు కరిముల్లా షా ఖాదరి నిషాని ధర్మకర్త పఠాన్ మాబు సుబాని ఇంటి వద్ద నుంచి గంధం, గుజ్జం బయలు దేరింది. ఈ ఉరుసు వేడుకలను పురస్కరించుకుని కరిముల్లా షా ఖాదరి నిషాని గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో దర్గా ప్రాంగణం అంతటా కళకళలాడింది అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు కరిముల్లా షా ఖాదరి నిషాని చుట్టూ ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మకర్త పఠాన్ మాహబూబ్ సుబాని ఆధ్వర్యంలో భక్తుడు షేక్ ఆసిఫ్ సహకారంతో ఉరుసు మహోత్సవం మూడు రోజులూ భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. పెదకాకాని దర్గా నుంచి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, క్రాకర్స్ కాంతుల మధ్య గంధం, గుర్రం గ్రామోత్సవం జరిగింది. శనివారం ఉదయం 11 గంటలకు కరిముల్లా షా ఖాదరి బాబా వారి నిషానికు చేరుకుని, బాబా వారి సలామి, ఖురాన్ చదివడం అనంతరం భక్తులకు బాబా వారి గంధం పంపిణీ చేయడం జరుగుతుందని ధర్మకర్త మాబు సుబాని తెలిపారు. భక్తులందరికీ అన్న సంతర్పణ జరిగింది.

మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి, పెనుమాకలోని చిగురు బాలల గ్రామంలో ఉన్న పునరుతేజం విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీవితాన్ని అర్ధాంతరంగా ముగించవద్దని సూచించారు. వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి డీ ఎడిక్షన చికిత్స ఉందని, ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, పెజ్జోని పేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా 9490492020ను సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ హెచ్‌ఆర్ మేనేజర్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ యస్ జోసెఫ్ డోనాల్డ్, జోనల్ కో ఆర్డినేటర్ బి. రమేష్ పాల్గొన్నారు.

ప్రొక్లెయినర్, లారీ సీజ్



నడింపాలెం (ప్రత్తిపాడు): అక్రమ మైనింగ్ తవ్వకాలకు వినియోగిస్తున్న ప్రొక్లెయినర్, లారీలను సీజ్ చేసినట్లు ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు తెలిపారు. మండల పరిధిలోని నడింపాలెంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం శుక్రవారం తనకు అందిందని తెలిపారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో ఉన్న ప్రొక్లెయినర్‌తో పాటు లారీని సీజ్ చేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి, వాహనాలను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.